సాక్షి
చిత్తూరు
ఆదివారం । 10 । మార్చి । 2024



వైఎస్సార్‌సీపీలో చేరిక
పూతలపట్టు సమన్వయకర్త సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 25 మంది టీడీపీ వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. - IIలో



వరి పంటలపై గజ దాడులు
ఐరాల మండలం చుక్కావారిపల్లెలో వరి పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసి నాశనం చేసింది. - IIలో



అన్నపై తమ్ముడి హత్యాయత్నం
పొలం వద్ద జరిగిన తగాదాలో అన్నదమ్ములు గొడవ పడ్డారు. ఇందులో అన్నపై తమ్ముడు కొడవలితో దాడి చేశాడు. - IIలో

న్యూస్‌రీల్

నమ్మకద్రోహి అమరనాథ్‌రెడ్డిని ఓడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్సీ

రామకుప్పం: మాజీ మంత్రి అమరనాథరెడ్డి పెద్ద నమ్మకద్రోహి అని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు. మండలంలోని ఆకందగానిపల్లిలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరనాథ్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నాడని, పెద్దిరెడ్డి దయతో గెలవలేదని చెప్పిన ఆయన గత ఎన్నికల్లో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వెంకటేగౌడ చేతిలో ఎందుకు చిత్తుగా ఓడిపోయారో చెప్పాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దయతో పలమనేరులో గెలిచిన అమరనాథ్ రెడ్డి వైఎస్సార్‌సీపీకి మోసం చేసి టీడీపీకి అమ్ముడుపోవడం ప్రజలందరికీ తెలిసిన విషయమేనన్నారు. చంద్రబాబుతో కలసి పుంగనూరు అభివృద్ధిని అడ్డుకోలేదా అని ప్రశ్నించారు. పుంగనూరును అభివృద్ధి చేసిన ఘనత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికే దక్కుతుందన్నారు. మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అమరనాథ్ రెడ్డిని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డెప్ప, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు శివశంకర్, రవినాయక్, యశ్వంత్ రెడ్డి, అబ్దుల్, హేమంత్ పాల్గొన్నారు.

732 మంది విద్యార్థుల గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 732 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం మ్యాథ్స్-1బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయన్నారు. ఈ పరీక్షలకు 13,054 మంది విద్యార్థులకు గాను 12,321 మంది హాజరయ్యారని తెలిపారు. డీవీఈఓ 04, డీఈసీ మెంబర్లు 09, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 10 సెంటర్లను తనిఖీలు చేసి పరీక్షల తీరును పర్యవేక్షించారని డీవీఈఓ వెల్లడించారు.

నోడల్ ఆఫీసర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే నోడల్ అధికారులను నియమించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు వివిధ ఎన్నికల నిర్వహణ మేనేజ్‌మెంట్‌లకు 16 మంది జిల్లా అధికారులను నియమించారు. వారు నిర్వర్తించాల్సిన విధులను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నోడల్ అధికారులకు ఇచ్చిన బాధ్యతలను ఎన్నికలు పూర్తయ్యే వరకు తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇందులో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా డీఆర్ పుల్లయ్య, ట్రెనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా బీసీ సంక్షేమశాఖ డీడీ కె.రబ్బానీబాషా, మెటీరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా పంచాయతి రీసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.షణ్ముగరామ్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా రవాణశాఖ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ జీ.నిరంజన్‌రెడ్డి తదితరులను నియమించారు.

జపనీస్ భాషపై శిక్షణ, ఉపాధి

చిత్తూరు కలెక్టరేట్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్‌లు సంయుక్తంగా జపనీస్ భాషపై శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులకు జపనీస్ భాష ఎన్-5, ఎన్-4, ఎన్-3 స్థాయిలో నేర్పించబడుతుందన్నారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మొదట్లో ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందన్నారు. జపాన్ దేశంలో పని చేసేందుకు ఆసక్తి ఉండి, 32 ఏళ్లలోపు వయసు ఉన్నవారు తమ అర్హత, ఆసక్తి మేరకు www.aprrdc.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9381109098 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రమణీయం.. రథోత్సవం



ఊరేగుతున్న శివపార్వతులు (ఇన్‌సెట్) రథం లాగుతున్న ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకాళహస్తి క్షేత్రంలో ముక్కంటి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. శివపార్వతుల నామస్మరణతో దక్షిణ కైలాసం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లింది. రథారూఢులైన స్వామి, అమ్మవార్లను సేవించి భక్తజనం పులకించింది. ఆదిమధ్యాంతర హితుని దివ్యతేజస్సును వీక్షించి పునీతమైంది. శక్తిస్వరూపిణి మహిమాన్విత స్వరూపాన్ని దర్శించి తరించింది. ఈ క్రమంలోనే రాత్రి నారద పుష్కరిణిలో వాయులింగేశ్వరుడు.. జ్ఞానప్రసూనాంబ తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. విద్యుద్దీప కాంతుల నడుమ తెప్పలపై కొలువుదీరిన తేజోమయ మూర్తులు కోనేరులో ఐదు ప్రదక్షిణలు చేశారు. నయనానందకరంగా సాగిన మహోత్సవాన్ని భక్తులు మనస్సులో నిక్షిప్తం చేసుకుని తన్మయత్వం చెందారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి




తెప్పలపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో ముక్కంటీశుడు

పవిత్రం.. లింగోద్భవం
మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం వేకువజామున లింగోద్భవ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను పవిత్ర లింగోద్భవ దర్శనానికి అనుమతించారు.

నేడు శివపార్వతుల కల్యాణం
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కనులపండువగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మికాభివృద్ధి
దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తున్నాం. పురాతన ఆలయాలకు పునర్వైభవం తీసుకువచ్చాం. స్వర్ణముఖిని ప్రక్షాళన చేశాం. కరకట్టను సుందరవనంగా తీర్చిదిద్దాం. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశాం. ఆలయ పాలకమండలిలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం.
– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

జోడీ అలజడి!



టీడీపీ నేతల్లో అసహనం తారస్థాయికి చేరింది.. అధినేత తీరుతో నైరాశ్యం అలుముకుంది.. జనసేనతో జోడీ కట్టినప్పుడే కలవరం మొదలైంది.. మళ్లీ కమలదళంతో జట్టు కుదరడం అసమ్మతికి మరింత ఆజ్యం పోసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గందరగోళం నెలకొంది.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త పొత్తు చిచ్చురేపుతోంది.. నోటిఫికేషన్ ముందే తమ్ముళ్లను ఓటమి భయం వెంటాడుతోంది.. తాజా పరిణామాలను గమనిస్తున్న ఆశావహుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.. ఇదే పరిస్థితి జనసైనికుల్లోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.. అరువు నేతలను తీసుకురావడంపై నిరసన వెల్లువెత్తుతోంది.

- టీడీపీ.. జనసేనలో పొత్తుల గుబులు
- చిత్తూరు, తిరుపతిలో 'ఆరణి' మంటలు
- సూళ్లూరుపేటలో వేనాటి తిరుగుబావుటా
- జీడీ నెల్లూరులో శ్రేణులకు అవమానాలు
- నగరి, సత్యవేడు నేతల్లో గందరగోళం
- వెంకటగిరిలో బాబు దాగుడుమూతలు

సాక్షి, తిరుపతి : టీడీపీ, జనసేన అధినేత తీరుతో ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర అలజడి మొదలైంది. ఇప్పటి వరకు ప్రకటించిన స్థానాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలతో టీడీపీ శ్రేణులకు నోటిఫికేషన్‌కు ముందే ఓటమి భయం పట్టుకుంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థిగా నెలవల విజయశ్రీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించినప్పటి నుంచి ఆ పార్టీకి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన వేనాటి రామచంద్రారెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి కినుక వహించారు. వేనాటి రామచంద్రారెడ్డి ఒక్క అడుగు ముందుకేసి వైఎస్సార్‌పీలో చేరేందుకు నిర్ణయించారు. సూళ్లూరుపేట రాజకీయాల్లోకి చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొండేపాటి గంగాప్రసాద్ వచ్చాక వేనాటివారి ప్రాభవం తగ్గించారనేది బహిరంగ రహస్యం. ఈ పరిస్థితుల్లో వేనాటి రామచంద్రారెడ్డి కుమారుడు సుమంత్ రెడ్డి వైఎస్సార్‌సీపీలోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ పర్యాయం తనొక్కడే కాకుండా కుటుంబసభ్యులు, అనుచరులను కూడా పార్టీలో చేర్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా తన కార్యాలయం ముందు, సూళ్లూరుపేట పట్టణం అంతా సిద్ధం బ్యానర్లను ఏర్పాటు చేసి తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

తమ్ముళ్లకు అవమానాలు
గంగాధరనెల్లూరు, నగరిలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అవమానాలు తప్పడం లేదు. ఎన్నికల ప్రచారం కోసం తనతో తిరిగేందుకు స్థానికులు ముందుకు రాకపోవడంతో టీడీపీ అభ్యర్థులు తమిళనాడు నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారు. వారికి రోజూ రూ.750 చెల్లిస్తున్నారు. ఈ పంపిణీ బాధ్యతలను స్థానిక టీడీపీ శ్రేణులను నమ్మని అభ్యర్థులు.. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా నియమించుకున్న వారికి బాధ్యతలు అప్పగించారు. దీనిపై తమ్ముళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమనను నమ్మనప్పుడు ఎన్నికల్లో పనిచేయలేమని చేతులెత్తేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్, ఆ పార్టీ నాయకులు పచ్చపత్రికల విలేకరులను పిలిపించుకుని భారీ ఎత్తున డిన్నర్ ఏర్పాటు చేసి, వారి చేతిలో కొంత నగదు పెట్టి ఎన్నికల్లో సాయం చేయమని కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సత్యవేడు నియోజక వర్గ టీడీపీ నేతలకు ఎమ్మెల్యే ఆదిమూలం తలనొప్పులు ఎక్కువయ్యాయి.



సూళ్లూరుపేటలో సుమంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వెంకటగిరిలో సర్వే నాటకాలు
వెంకటగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు సర్వేల పేరిట దాగుడు మూతలాడుతున్నారు. మొన్నటి వరకు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేరుతో సర్వే చేశారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె, మస్తాన్ యాదవ్ పేర్లతో సర్వే చేయిస్తున్నారు. దీంతో స్థానిక టీడీపీలో గందరగోళం నెలకొంది.

తిరుపతి, చిత్తూరులో అసమ్మతిరాగం
చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీలోకి రాక ముందు.. కొన్నాళ్లు టీడీపీలో, ఆ తర్వాత ప్రజారాజ్యంలో చేరి ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించారు. చంద్రబాబు సీటు ఇవ్వకపోవడంతో ఆరణి శ్రీనివాసులు టీడీపీకి రాజీనామా చేశారు. వైఎస్సార్‌పీలో చేరి తొలుత ఓడిపోయారు. మళ్లీ 2019లో ఫ్యాన్ గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులు ఈ ఐదేళ్ల కాలంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కోవడంతో ఈ సారి వైఎస్సార్‌సీపీ ఆయనను పక్కనపెట్టింది. దీంతో ఆరణి శ్రీనివాసులు టీడీపీలో చేరేందుకు విఫల యత్నం చేశారు. చివరకు కాపు కార్డుతో జనసేనలో చేరాడు. తిరుపతి టికెట్ తనకే కావాలని పట్టుబడుతున్నారు. ఈ పరిణామాన్ని చిత్తూరు, తిరుపతికి చెందిన జనసేన శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే.. పొత్తులో భాగంగా తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించడంపై టీడీపీలోని ఆశావాహులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బైబై బాబు!

- తిరుపతిలో గుర్తే లేకుండా చేస్తారా?
- ఇలా ఐతే మేం పనిచేయలేం
- తిరుపతిలో టీడీపీ నేతల అత్యవసర సమావేశం
- శ్రీకాళహస్తిలో బొజ్జల కుటుంబం ఆందోళన

'పార్టీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు టీడీపీ గుర్తు లేకుండా ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. అటువంటి పార్టీకి ఈ ఎన్నికల్లో గుర్తే లేకుండా చేస్తారా..?. ఇవేం పొత్తులు..? ఇలా అయితే మేం చేయలేం' అంటూ టీడీపీ నేతలు తెగేసి చెబుతున్నారు. ఒక వేళ కాదు కూడదు అంటే మేం దూరమవుతామని కరాఖండీగా చెప్పేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకోవడంపై కొందరు నాయకులు రగిలిపోతున్నారు. రెండుమూడు రోజుల్లో సీట్ల కేటాయింపు ఖరారు కానుండడంతో టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం ప్రకారం తిరుపతి పార్లమెంట్, అసెంబ్లీ నుంచి దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుపతి అసెంబ్లీ ఇప్పటికే జనసేనకు కేటాయించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా బీజేపీతో పొత్తు కుదరడంతో తిరుపతి పార్లమెంట్ టికెట్ కూడా టీడీపీకి దక్కే పరిస్థితి లేదని తేలిపోయింది. దీనిపై తిరుపతి టీడీపీ నేతలు శనివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకించాలని నిర్ణయించారు. తిరుపతి ఎంపీ లేదా? అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒకటి టీడీపీ అభ్యర్థి ఎవరో ఒకరు పోటీ చేయాలి? ఆరణి శ్రీనివాసులుకు కాకుండా తిరుపతికి చెందిన నేతనే జనసేన అభ్యర్థిగా పోటీకి దింపాలి.. అని తీర్మానాలు చేసినట్లు సమాచారం.

శ్రీకాళహస్తిలో బొజ్జల ఆందోళన
ప్రస్తుతం శ్రీకాళహస్తి అసెంబ్లీ కూడా టీడీపీ వదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే జరిగితే టికెట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎస్సీవీ నాయుడు ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లినట్లేనని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

మూడు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- వాటర్ పైపులైన్, ఆర్‌ఓ ప్లాంటు ప్రారంభించిన మంత్రి రోజా



మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణలో మంత్రి ఆర్కేరోజా

నగరి : మండలంలోని నంబాకం సచివాలయ పరిధిలోని గ్రామాలకు 3 దశాబ్దాల పాటు ఉన్న తాగునీటి సమస్య మంత్రి ఆర్‌కే రోజా చొరవతో పరిష్కారమైంది. శనివారం బుగ్గ అగ్రహారం గ్రామం నుంచి దేశూరు అగరం దళితవాడ, ఎస్టీ కాలనీ, నంబాకం, నంబాకం హరిజనవాడ, చిన్నలూరు గ్రామాలను కలుపుతూ 15వ ఫైనాన్స్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌ను, రోజా చారిటబుల్ ట్రస్టు నిధులు రూ.6 లక్షలు, మండల గ్రాంటు రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును మంత్రి ప్రారంభించి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. గ్రామంలో నీరు ఉన్నా తాగడానికి అనువుగా లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి ఉండేదన్నారు. ఈ గ్రామాలకు తాగునీరు స్వచ్ఛమైన తాగునీరు అందించాలంటూ సుదూర ప్రాంతాల్లోని కొండ అంచుల నుంచి తాగునీటిని అందించాల్సి ఉందన్నారు. దీంతో గత పాలకులు ఎవరూ ఈ సమస్యపై దృష్టి సారించలేదన్నారు. అసాధ్యం అనుకున్న పనిని నేడు సుసాధ్యం చేయగలిగామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీ, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఎంపీటీసీ గుణశేఖర్ రెడ్డి, నాయకులు శేఖర్, డిల్లీబాబు, విజయులు రెడ్డి, రాజేంద్ర, దినకర్‌రెడ్డి, రవికుమార్, రంగనాథం, పరంధామరెడ్డి, రవిరాజు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందన రద్దు రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల స్పందనను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

అన్నపై తమ్ముడి హత్యాయత్నం

పుంగనూరు: పొలం వద్ద తలెత్తిన గొడవలో స్వయాన అన్నపై ఓ తమ్ముడు వేటకొడవలితో హత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో శనివారం వెలుగు చూసింది. మండలంలోని అరవవాండ్లపల్లికి చెందిన నాగరాజు, ప్రేమ్‌కుమార్ అన్నదమ్ములు. వీరికి పొలం వద్ద నీటి సమస్య రావడంతో ప్రేమ్‌కుమార్ రెచ్చిపోయి వేటకొడవలితో అన్నపై దాడి చేశాడు. ఆ సమయంలో నాగరాజు ఎడమచేయి అడ్డు పెట్టడంతో వేటకొడవలితో రెండుసార్లు చేతిపై నరికాడు. తీవ్ర రక్తగాయాలు కాగా స్థానికులు నాగరాజును కాపాడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రేమ్‌కుమార్ పలుమార్లు ఇలాంటి దాడులు చేసినట్లు, పోలీసులు కేసులు నమోదు చేసినట్లు నాగరాజు తెలిపారు.

మెరుగు ముసుగులో దోపిడీ..

పూతలపట్టు: మెరుగు పెడతామని చెప్పి కొందరు వ్యక్తులు దోపిడీకి పాల్పడిన విషయం ఆలస్యం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. బంగారు నగలకు మెరుగు పెడతామని మూడురోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు పి.కొత్తకోట గ్రామానికి వచ్చారు. గ్రామానికి చెందిన రాధమ్మ అనే మహిళ తన వద్ద ఉన్న కాళ్ల గొలుసులు, 16 గ్రాముల బంగారు చైన్‌ను మెరుగు పెట్టడానికి వారికి ఇచ్చింది. వచ్చిన ఆ ఇద్దరు మొదట కాళ్ల గొలుసులును మెరుగు పెట్టి ఆమె చేతికి ఇచ్చారు. ఆమె ఆ గొలుసును ఇంటిలోపల భద్రపరిచి తిరిగి వచ్చేసరికి ఆ ఇద్దరు వ్యక్తులు బంగారు చైన్‌తో పరారైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అప్రమత్తమయ్యారు.

వరిపంటలపై గజ దాడులు

ఐరాల: మండలంలోని అటవీ ప్రాంతానికి సమీప గ్రామమైన చుక్కావారిపల్లెలో ఉన్న వరి పంటలపై ఆదివారం ఏనుగుల గుంపు దాడి చేసింది. గ్రామంలోని దొరస్వామి, బాలాజీ, జనార్దన్ రైతులకు చెందిన రెండున్నర ఎకరాల్లోని వరిపంటను తిని, తొక్కి నాశనం చేశాయి. సుమారు రూ.50 వేల పంట నష్టం వాటిలినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రతి రోజు ఏనుగుల గుంపు గ్రామం సమీపంలోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఏనుగుల గుంపు సమీప అటవీ ప్రాంతంలో తిష్టవేసినట్లు రైతులు చెబుతున్నారు. ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నీకు ఏజెన్సీలు లేవని ప్రమాణం చేస్తావా?

- రాజకీయాల్లో పెద్దిరెడ్డి ఓ బ్రాండ్
- కియాలో మీకు ఏజెన్సీలు లేవని గుడిలో ప్రమాణం చేయగలవా అమరనాథ్‌రెడ్డి ?
- పెద్దిరెడ్డి అండ లేకుండా నీవు పలమనేరు ఎమ్మెల్యేగా గెలిచేవాడివా ?
- ప్రజలను ఓటు అడిగే కనీస హక్కు ఉందా నీకు ?
- మా సత్తా ఏంటో 2019లో తెలిసింది.. అయినా మళ్లీ ప్రగల్భాలా ?
- మాజీమంత్రి అమరనాథ్ రెడ్డికి ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: 'మీరు వైఎస్సార్‌సీపీలో ఫ్యాను గుర్తుపై గెలిచి కేవలం మంత్రి పదవి కోసం టీడీపీలోకి వెళ్లి పరిశ్రమల శాఖమంత్రిగా మీ స్వార్థం కోసం కియా పరిశ్రమలో ఏజెన్సీలు పొందలేదని ఏ గుడిలోనైనా ప్రమాణం చేసే ధైర్యం మీకుందా' ? అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మాజీ టీడీపీ మంత్రి అమరనాథరెడ్డికి సవాల్ విసిరారు. పలమనేరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గ నాయకులతో కలసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏం మాట్లాడారంటే.. ''పుంగనూరులో మీరు ఓడిపోయారా ? లేదా ? 2009లో ఎలా గెలిచారో ప్రజలకు తెలీదా ? 2014లో పెద్దిరెడ్డి అండతో మీరు గెలిచింది నిజమా ? కాదా ? ఎలాగైనా జీవితంలో మంత్రి కావాలనే లక్ష్యంతో మీరు టీడీపీని మోసం చేసి ఆపై వైఎస్సార్‌సీపీలో చేరి అడ్డదారిలో మంత్రి పదవి తీసుకోలేదా ? వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు చంద్రబాబు చెత్తనాయకుడని, ఆయన కొడుకు లోకేష్ పప్పుగాడని నానా మాటలు అనలేదా ? పరిశ్రమలశాఖ మంత్రిగా మీరు కియాలో ఏజెన్సీలు పొందలేదా? గంద్రాజుపల్లి ఏపీఐఐసీలో మీతో పాటు మీ అనుచరులకు స్థలాలు కేటాయించి మీరు కాదా ? జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌తో సవాల్ చేసి వైఎస్సార్‌సీపీ స్థాపించి కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసింది జగన్‌మోహన్‌రెడ్డి కాదా ? ఆయన భిక్షతో మీరు ఎమ్మెల్యే కాలేదా ? మీలాగా అమ్ముడుపోయిన వ్యక్తి పెద్దిరెడ్డి కాదు. మంత్రిగా పలమనేరుకు ఏమీ చేయలేని మీరు ఈ దఫా ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కును కోల్పోయారు. మీకు అంతస్థాయి ఉంటే 2019 ఎన్నికల్లో సామాన్యుడైన నాపై ఎందుకు 33 వేల ఓట్లతో చిత్తుగా ఓడారో చెప్పగలరా ? ఇంకో 40 రోజుల్లో పెద్దిరెడ్డి సత్తా ఎలా ఉంటుందో మీకు చూపిస్తాం.. మీరు ఎలా గెలుస్తారో అది చూద్దాం'' అని ఘాటుగా మాట్లాడారు.


మీరు చేసిందేమిటో అందరికీ తెలుసు..



కృష్ణమూర్తి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట పార్లమెంటు పరిశీలకుడు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ''మాది పెద్ద రాజకీయ కుటుంబం అని చెప్పే మీరు మీ తండ్రి, మీ హయాంలో పుంగనూరుకు ఏం చేశారు ? పెద్దిరెడ్డి ఏం చేశారో చూపిందేందుకు మేంసిద్ధం.. మీకు ఆ దమ్ముందా ? పరిశ్రమల శాఖ మంత్రిగా ఏపీఐఐసీలో స్థలాలు మీరు కొట్టేసినట్టుగా పెద్దిరెడ్డి ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్టు నిరూపిస్తారా ? పట్టణ సమీపంలోని కొంగోళ్లపల్లిలో రైతులు అమ్మితే కొన్నామే గానీ దాంతో మంత్రికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఒక టికెట్ కొని ఇంకో బస్సులో వెళ్తామా..?



సుభాష్ చంద్రబోష్, సూపర్‌బజార్ అధ్యక్షుడు

ఎవరైనా ఓ బస్కెక్కి కండక్టర్ వద్ద టికెట్టు కొని అదే టికెట్టుతో ఇంకో బస్కెక్కి ఎవరైనా వెళ్తారా ? అని పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్ ఎద్దేవా చేశారు. ఆయన మాటల్లో.. గంగవరం మండలంలో మీ కోబ్రదర్ పేరిట నాలుగురోడ్ల వద్ద రైతుల నుంచి డీకేటీ ఎకరా రూ.70 వేలు, పట్టా రూ.లక్షతో మీరు 170 ఎకరాలను కొన్నారా ? లేదా? ఆపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్కడ సెజ్ కోసం మీ భూములనే ఎకరా రూ.5.5 లక్షలకు ఎల్‌ఏలో ఇచ్చింది నిజం కాదా ? దీనిపై మీ కోబ్రదర్ ద్వారా కోర్టుకెళ్లిన మీరు పరిశ్రమల శాఖ మంత్రి అయిన తరువాత ఆ శాఖ ఉన్నతాధికారుల సాయంతో 17.5 ఎకరాలను ఎలా వెనక్కి తెచ్చుకున్నారు ? దీని విలువ ఇప్పుడు ఎన్ని కోట్ల రూపాయలో జనానికి తెలుసు. చంద్రబాబు హయాంలో అదే సెజ్‌లో భారీ పరిశ్రమను పెడతామని మీ భార్య రేణుకారెడ్డి పేరిట మీరు పొందిన 4 ఎకరాల స్థలంలో ఇప్పటికీ ఏ ఫ్యాక్టరీ లేదు. ఎందుకు కట్టలేదో చెప్పగలవా ? ఆఖరికి టీడీపీని కష్టకాలంలో బతికించిన నాకు కాకుండా మీ వ్యక్తిగత సహాయకుడు ? మీ ఫొటోలు తీసే వాడికి ? నీ అనుచరులకు ఎంఎస్‌ఎంఈలో స్థలాలు కేటాయించింది నిజం కాదా ? అక్కడ స్థలాలు పొందిన వారి నుంచి మీ ఏజెంట్లు ప్రత్యేక కార్యాలయాన్ని పెట్టి డబ్బు వసూలు చేసింది నిజం కాదా ? పరిశ్రమల శాఖ మంత్రిగా ఇన్ని అక్రమాలకు అప్పట్లో నేనే సాక్షి కాదా ? ఎందుకబ్బా ఇలా జనాన్ని ఏమార్చుతావు''? అని గట్టిగా విమర్శించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పలమనేరు మున్సిపల్, గంగవరం కన్వీనర్లు జాఫర్, మోహన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ మండీ సుధా, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, కౌన్సిలర్లు రహీంఖాన్, శ్యామ్, నాగరాజు, నాయకులు ప్రహ్లాద, చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



రామకుప్పం: ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో కి చేరిన గిర్రెప్ప గౌడు

తవణంపల్లె: మండలంలోని దిగువ కారకాంపల్లెలో టీడీపీ కార్యకర్తలను పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి సమక్షంలో కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. శనివారం దిగువకారకాంపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి రావడంతో సమన్వయకర్త సునీల్‌కుమార్ పార్టీ కండవాలు వేసి సాదరంగా స్వాగతించారు. అనంతరం పార్టీలో చేరిన దిగువ కారకాంపల్లె చెందిన గోపి, విజయకుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి మరోసారి సీఎంగా చేయాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. గ్రామానికి చెందిన 25 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు వారు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన గిర్రెప్ప గౌడు

రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గిర్రెప్పగౌడు ఇటీవల టీడీపీలోకి వెళ్లారు. శనివారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో మళ్లీ వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. ఆయనకు భరత్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గిర్రెప్పగౌడు మాట్లాడుతూ కులసంఘం సమావేశం ఉందని పిలుచుకుని వెళ్లి తనకు టీడీపీ కండువా వేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు మద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డెప్ప,స్థానిక నేతలు నారాయణగౌడు, శ్రీనివాసులు గౌడు, రామ్మూర్తి, రాజారెడ్డి, రాంబాబు, భూషణ్‌నాయక్, సిద్దప్ప, రాము పాల్గొన్నారు.

ఏళ్ల కల.. నెరవేరిన వేళ



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

చిత్తూరు రూరల్: వైద్య వృత్తిలో కొందరు ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తూ నలిగిపోతున్నారు. వారి కష్టానికి ప్రతిఫలం దక్కకుండా పోయింది. వెట్టి చాకిరీ తప్ప సేవలను గుర్తించే వారు కరువయ్యారు. ఏదో ఒకరోజు మంచి జరగకపోతుందా అని దేవుడిపై భారం వేసి ఆ వృత్తే పరమావధిగా భావించి కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఎవరో ఒకరు వస్తారు ? కచ్చితంగా మంచి చేయకపోతారా అని 20 ఏళ్లుగా కలలు కన్నారు. వెయ్యేళ్లతో ఎదురుచూశారు. ఆ ఒక్క రు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయ్యారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కన్నీళ్లు తుడుస్తూ 20 ఏళ్ల కలను సాకారం చేశారు. జిల్లావైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 152 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్లు 20 మంది, ఎంపీహెచ్‌ఏ–ఎఫ్‌లు 31 మంది, ఫార్మసిస్ట్ 23 మంది, ఎంపీహెచ్‌ఏ–ఎంలు 78 మందిని క్రమబద్ధీకరించారు. ఈ మేరకు శనివారం జిల్లా కార్యాలయం ఎదుట వారు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వరంలా భావిస్తున్నాం..



మమల్ని క్రమబద్ధీకరిస్తారని మేము అనుకోలేదు. ఎన్నో ఏళ్లుగా కలలు కన్నాం. పోరాడాం. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొన్నేళ్లుగా అవస్థలు అనుభవించాం. రోడెక్కాం. గత ప్రభుత్వం కూడా మమల్ని గుర్తించలేదు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం మా కష్టాన్ని గుర్తించారు. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. మాకలను నెరవేర్చారు. ఇది వరంలా భావిస్తున్నాం.

– సతీష్‌కుమార్, ఎంపీహెచ్‌ఏ–ఎం, చిత్తూరు

హ్యాపీగా ఉన్నాం..



ఇన్నాళ్లకు మా వృత్తికి తగిన గుర్తింపు లభించింది. మమల్ని ఈ ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ చేయడం గొప్ప విషయం. మా కుటుంబం మొత్తం కూడా ఆనందంగా ఉంది. అందుకు ముఖ్య కారణం సీఎం జగనన్నే. కుంగిపోయిన మా బతుకులను క్రమబద్ధీకరణతో ఊపిరిపోసి బతికించారు. నిజంగానే జగనన్న మాట ఇస్తే తప్పడు అనే మాట నిలబెట్టుకున్నారు. ఈ మేలును ఎప్పటికీ మర్చిపోం.

– ఉష, ఎంపీహెచ్‌ఏ–ఎఫ్, గంగవరం

మా కల ఇది..



20 ఏళ్ల తర్వాత మా కల నెరవేరింది. ఇందుకోసం ఎన్నో ఏళ్లుగా వెయ్యి కళ్లతో వేచిచూశాం. ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమైంది. గతంలో ఎంతోమంది చెప్పారు..కానీ అమలు చేయలేకపోయారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశారు.. పని చేస్తున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– చంద్ర, ఎంపీహెచ్‌ఏ–ఎం, గుడిపాల

వెలుగులు నింపారు..



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని మాట ఇచ్చారు. అయితే కొన్నాళ్లకే ఆ మహానేతను దేవుడు తీసుకెళ్లిపోయాడు. గత ప్రభుత్వంలో కూడా ఎదురు చూపులు మాత్రమే మిగిలిపోయాయి. చివరికి తండ్రి ఇచ్చిన మాటను ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఈరోజు మా ఆనందానికి అవధులు లేవు. ఇటువంటి నాయకుడు, మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

– సుజాత, ఎంపీహెచ్‌ఏ–ఎఫ్, తుంబకుప్పం పీహెచ్‌సీ, బంగారుపాళ్యం

పాము కాటుకు విద్యార్థిని మృతి



యశ్వంతి మృతదేహం

పెద్దపంజాణి: పాము కాటుకు గురై విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలోని కెళవాతి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని వీరప్పల్లి పంచాయతీ కెళవాతి గ్రామానికి చెందిన రెడ్డెప్ప డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామం చివరలో సొంతిల్లు కట్టుకుని కాపురం ఉంటున్నాడు. రెడ్డెప్ప, హిమబిందు దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె యశ్వంతి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. రోజువారీ మాదిరి శుక్రవారం రాత్రి భోజనం అనంతరం కుటుంబసభ్యులు అంతా కలసి ఇంట్లో నిద్రించారు. ఈ నేపథ్యంలో శనివారం వేకువజామున నిద్రలో ఉన్న యశ్వంతి(10)ని కట్లపాము కాటు వేసింది. దీంతో అమ్మాయి గట్టిగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు పామును చంపేసి బాలికను హుటాహుటిన మండలంలోని గుట్టూరులో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అమ్మాయి మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు.